# సుబ్రమణ్య స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు


మారేడ్‌పల్లి సుబ్రమణ్య స్వామి దేవాలయం షష్టి మహోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

అడ్డగుట్ట, డిసెంబర్ 18 ప్రభాతవార్త: ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా జీవించాలని స్వామి వారిని వేడుకున్నట్లు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సుబ్రమణ్య స్వామి షష్టి మహోత్సవా లను పురస్కరించుకొని వెస్ట్ మారేడ్‌పల్లిలోని సుబ్రమణ్య స్వామి దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం తలసానికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సి.సంతోష్ యాదవ్, ఈఓ అరుణ కుమారి, ధర్మకర్తలు చొల్లేటి రమేశ్, గుజ నాగేందర్ యాదవ్, వేణుగోపాల్ చారి, పద్మజా, జె.భాస్కర్, కె.నర్సింగ్ రావ్, ఎక్స్ అఫిసియో మెంబర్ రాజేశ్వర శర్మ,మోండా డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర సంగీతనాటక అకాడమీ అవార్డు గ్రహీత

## ప్రేమరామమూర్తికి జీవితసాఫల్య పురస్కారం

రవీంద్రభారతి, డిసెంబరు 18 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, లలిత రాజా ఫౌండేషన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ, న్యూయార్క్ రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ అవార్డుల గ్రహీత, ప్రముఖ కర్ణాటక గాత్ర, సంగీత కంపోజర్ సంగీతరత్న విధుషీ ప్రేమ రామమూర్తికి జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు డా. మామిడి హరికృష్ణ, కె.కె.రాజాలు మీడియాకు తెలిపారు. ఈరోజు 19 మంగళవారం రాత్రి 6గంటల నుండి జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్‌శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు విచ్చేసి విశిష్ట అతిథులు డా. ఆనంద్ శంకర్ జయంత్, వెంకట్ గరికపాటి, అశ్విని సుబ్బారావు, ప్రొఫెసర్ కె.వి.చలపతి తదితరులతో కలిసి విధుషీ ప్రేమ రామమూర్తిని ఘనంగా సత్కరించి జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేస్తారని, సభకుముందు డా. జయప్రద రామమూర్తిచే కర్ణాటక వేణుగానం ఉంటుందని, అధికసంఖ్యలో సంగీతప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని ఆస్వాదించి విజయవంతం చేయాలని మామిడి హరికృష్ణ, కె.కె.రాజాలు కోరారు.

## వడ్డెరులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలి

### జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేష్ విజ్ఞప్తి


రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సత్కరిస్తున్న వేముల వెంకటేష్

సైఫాబాద్, డిసెంబరు 18 ప్రభాతవార్త: గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో 9 ఏళ్ళలో రాష్ట్రంలోని లక్షలాది మంది వడ్డెరులు అన్ని రంగాలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సంక్షేమ, రాజకీయ రంగాలలో తీవ్రంగా నష్టపోయారని జాతీయ వడ్డెర సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెరులను అన్ని రంగాలలో అదుకుని న్యాయం చేయాలని సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర నూతన బిసి సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ గత ప్రభుత్వం వడ్డెరులను అసలు పట్టించుకోలేదని, అన్ని రంగాలలో అణగదొక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెరులకు న్యాయం చేయాలని, నామినేటెడ్ పదవులలో, వివిధ కార్పోరేషన్‌ల ఛైర్మన్‌లు, డైరెక్టర్లు, ఎమ్మెల్సీ పదవులతోపాటు, మైనింగ్‌లో, ప్రభుత్వ ప్రాజెక్టుల నిర్మాణాలలో రిజర్వేషన్‌లు కల్పించాలని, అలాగే రుణాలను అందించాలని, బిసి బంధులో ఎక్కువగా అవకాశం కల్పించాలని వేముల వెంకటేష్ కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు బత్తుల లక్ష్మీకాంతయ్య, మధు, తిరుమలేశ్, వెంకట్ తదితరులు ఉన్నారు.

## ప్రమోషన్లు పునరుద్దరించి న్యాయం చేయండి

### విద్యుత్‌శాఖ మంత్రి భట్టివిక్రమార్కకు రివర్షన్ ఇంజనీర్స్ వినతి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రివర్షన్ పొందిన ఇంజనీర్లు

హైదరాబాద్,డిసెంబరు 18 ప్రభాతవార్త : టిఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కోలో వెనక్కి తీసుకున్న 166మంది ఇంజనీర్ల ప్రమోషన్లను పునరుద్దరించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి తమకు న్యాయం జరిగేలా చూడాలని రాష్ట్ర విద్యుత్ శాఖ రివర్షన్ ఇంజనీర్ల జేఏసీ డిప్యూటీ సిఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కను కోరింది. ఈ మేరకు సోమవారం జ్యోతిభాపూలే ప్రజాభవన్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేసింది.ఈ సందర్భంగా ఇంజనీర్లు బాలాజీ రాథోడ్, అంజయ్య, రాధా కృష్ణ, అంజన్‌రెడ్డి, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ కొద్దిరోజులకు సంస్థలోని 166 మంది ఇంజనీర్లకు సిఇ, ఎస్‌ఈ, డిఈ, ఎడిఈలుగా పదోన్నతి కల్పించారన్నారు.6 నుంచి 8 నెలలు పాటు ఆపదవుల్లో పని చేశాక ఇచ్చిన పదోన్నతులను వెనక్కి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా జరగటంతో అవమానంతో మానసికంగా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో తమ ఆంధోళనను గుర్తించిన గత సిఎండి తిరిగి ప్రమోషన్ ఇస్తామని టిఎస్ ట్రాన్స్‌కో,జెన్‌క్‌లోని అసోసియేషన్లు (టిఈఈఏ,టిఎస్సీ ఈఏ) సమక్షంలో ఒప్పుకోవటం జరిగిందన్నారు.అయితే ఇదే సమయంలో ఎలక్షన్ కోడ్ రావటం,సిఎండి రాజీనామా చేయటంతో తమ పరిస్థితి మొదటికి వచ్చిందన్నారు.కావున తమ ఆవేదనను గుర్తించి తమ ప్రమోషన్లను పునరుద్దరించి తమకు తగిన న్యాయం జరిగేలా చూడాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు.

## వైభవంగా కూచిపూడి నృత్యకళానికేతన్ వార్షికోత్సవం


స్వరాజ్యలక్ష్మిని అవార్డుతో సత్కరిస్తున్న రవికుమార్, దైవజ్ఞశర్మ, రత్నాకరశర్మ

నాంపల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త : పిల్లలు, సమాజం సంస్కారవంతంగా ఎదగాలంటే మన గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, కళలను కాపాడుకొంటూ ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇందులో ప్రతీఒక్క తల్లిదండ్రుల బాధ్యత, పాత్ర కీలకమైనవని, విదేశాలలో వెల్లివిరుస్తున్న మన సంస్కృతి దేశంలో కరువైందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డా. రవికుమార్ ఆవేదన వ్యక్తపరిచారు. ప్రముఖ కళాసంస్థ కూచిపూడి నృత్యనికేతన్ నృత్యగురువు స్వరాజ్యలక్ష్మి నేతృత్వంలో రత్నకర్‌శర్మ అధ్యక్షతన జరిగిన సంస్థ 15వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన రవికుమార్ విశిష్ట అతిథులు దైవజ్ఞశర్మ, గురువులు శంభుని, హారిణి, కనకదుర్గ, న్యాయవాది అనిల్‌కుమార్, శ్రీనివాసశర్మ, అరుణకుమారి తదితరులతో కలిసి తెలంగాణ ప్రాంత ప్రతినిధి ఉమాకాత్యాయని అవార్డును స్వరాజ్యలక్ష్మికి ప్రదానంచేసి సంస్థ స్పార్క్ బుక్ ఆఫ్ ట్రెడిషన్స్ వరల్డ్ రికార్డులో నమోదు, స్వరాజ్యలక్ష్మి కళాసేవలను అభినందించారు. అనంతరం వివిధ నృత్యప్రదర్శనలు కావించిన కళాకారులందరికీ జ్ఞాపికలు, అందజేసి శుభాభినందనలు తెలిపారు.

## సుబ్రమణ్య స్వామి దేవాలయంలో ఘనంగా షష్టి మహోత్సవం


సుబ్రమణ్య స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న కార్పోరేటర్ కొంతం దీపిక

కంటోన్మెంట్,డిసెంబర్ 18 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజక వర్గం వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సుబ్రమణ్య స్వామి దేవాలయంలో సోమవారం షష్టి మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం శ్రీ వల్లి దేవసేన స్వామి వారికి క్షీరాభిషేకం, పుష్పాలంకరణ, తీర్థప్రసాదం, సాయంత్రం కళ్యాణం, పల్లకి సేవా, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, బిజెపి నాయకులు బానుక మల్లికార్జున్, కొంతం నరేశ్, కాంగ్రెస్ నేత బద్రినాథ్ యాదవ్, బిఆర్ఎస్ నేతలు ముప్పిడి మధుకర్, పరశరామ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను ఈఓ అరుణ కుమారి, ఆలయ చైర్మన్ సంతోష్ యాదవ్, ధర్మకర్తలు చొల్లేటి రమేశ్, నాగేందర్ యాదవ్, వేణుచారి, భాస్కర్‌లు ఘనంగా సన్మానించారు.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అంబటి శ్రీనివాస్

## వైభవంగా శివమార్కెండయ దేవాలయ వార్షికోత్సవం

మెహిదీపట్నం, డిసెంబర్ 18, ప్రభాతవార్త : కార్వాన్ శివ మార్కెండ దేవాలయ 13 వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో మృత్యుంజయ రాజశ్యామల యాగంను బాలమార్తాండ మాణిక్‌ప్రభు మహారాజులచే నిర్వహించారు. ఈ సందర్భంగా కార్వాన్ పరిసర ప్రాంతాలలోని పద్మశాలి కులబాంధవులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ నర్సింగ్‌రావు భక్తులు చరణ్ రాజ్ గోపాల్, మదన్‌మోహన్, బాలరాజు, మహేష్, ఉదయ్, శ్రీనివాస్ మహిళలు పాల్గొన్నారు.

### తిరుమలగిరిలో మద్యం దుకాణం

## తరలించాలని స్థానికుల ఆందోళన

కంటోన్మెంట్,డిసెంబర్ 18 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 7వ వార్డు తిరుమలగిరి ఫుట్‌బాల్ క్రీడా మైదానం సమీపంలో కొనసాగుతున్న మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఏయిర్‌లైన్స్ కాలనీ, మలానీ కాలనీ, పద్మనాభ కాలనీల వాసులు వైన్స్ ముందు ఆందోళన చేశారు. కాలనీలకు వెళ్లే రోడ్డు మార్గంలో మద్యం షాప్ కొనసాగించడం వల్ల స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మత్తులో తాగుబోతులు దొంగతనాలకు పాల్పడుతుంటారని, అసాంఘీక కార్యక్రమాలు జరుగుతాయని స్థానికులు డిమాండ్ చేశారు. పోలీసులు, ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్పందించి వైన్ షాప్‌ను ఎత్తివేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.

## సమస్యల సత్వర పరిష్కారానికి కృషి: ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు


ఎమ్మెల్సీ రాజుతో వివిధ ప్రాంతాల నాయకులు

దుండిగల్, డిసెంబర్ 18 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు నాయకులు మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును ఆయన కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమస్యలను త్వరితంగా పరిష్కరిచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## పాతబస్తీ అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్

చార్మినార్, డిసెంబరు 18 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం గాంధీభవనంలో బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కలిశారు.బహదూర్‌పుర నియోజకవర్గం అభివృద్ధిపై సిఎం రేవంత్‌రెడ్డికి రాజేష్ కుమార్ వినతి పత్రం అందజేయటంతో పాటు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల గురించి వివరించారు.ఈ సందర్భంగా బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ మాట్లాడుతూ పాతబస్తీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.పాతబస్తీకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బెంగాలీలు మరింత అభివృద్ధి సాధించాలి

### మాజీ హోంశాఖ మంత్రి మహమూద్ అలీ


మాజీ మంత్రి ఎమ్మెల్సీ మహమూద్ అలీని కలిసిన తెలంగాణ బెంగాలీ సమితి ప్రతినిధులు

చార్మినార్,డిసెంబరు 18 ప్రభాతవార్త : బెంగాలీలు అన్ని రంగాలలోను మరింత అభివృద్ధి సాధించవలసిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి,ఎమ్మెల్సీ మహమూద్ అలీ అన్నారు.తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్ ఆధ్వర్యంలో పలువురు బెంగాలీ సమితి ప్రతినిధులు సోమవారం మాజీ మంత్రి మహమూద్ అలీని మర్యాద పూర్వ కంగా కలిశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బెంగాలీ సమితి ప్రతి నిధులు దీపాంకర్ పాల్, మందిరియా నస్కర్,బబ్లూ,సుమతో పాటు పలువురు పాల్గొన్నారు.

# మీ అందరి సమిష్టి కృషితో అఖండ విజయం సాధ్యమైంది

### కృతజ్ఞత సభలో ఎమ్మెల్యే వివేకానంద్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, డిసెంబర్ 18 ప్రభాతవార్త: గులాబీ శ్రేణుల ముమ్మర ప్రచారం, సమిష్టి కృషితలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో 85,576 ఓట్ల మెజారీతో చారిత్రాత్మక విజయాన్ని అందుకున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులను అభినందిస్తూ మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్లో కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నా రాజకీయ ప్రస్థానంలో ఇంతటి అపూర్వ విజయాన్ని కట్టబెట్టినందుకు ప్రతి ఒక్క నాయకులు, కార్యకర్త, అభిమానులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇది నా ఒక్కడి గెలుపు కాదని మనందరి సమిష్టి విజయమని తెలిపారు. మీరందరూ వివేకానంద మాఇంటి వ్యక్తి అనుకొని ఓటు వేసి, ఇతరులు వేసేలా వారిని ప్రోత్సహించారు. నా జీవితంలో మరిచిపోలేని విధంగా రాష్ట్రం మొత్తం కుత్బుల్లాపూర్ గురించి చర్చిస్తూ మన అభివృద్ధి గురించి మాట్లాడుకునేలా చేశారన్నారు. నియోజకవర్గంలో బిఆర్ఎస్‌కు తిరుగులేదని, ఇతర పార్టీలకు స్థానం లేదని రుజువు చేశారు. ఇంతలా నావెంట ఉండి నాగెలుపుకు కృషి చేసిన ప్రతి గులాబీ సైనికునికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రికి సన్మానం


రోడ్డు రవాణా శాఖ మంత్రిగా పదవి భాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న టిఎన్‌జిఓ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ

అఫ్జల్‌గంజ్, డిసెంబర్ 18ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రిగా పదవిభాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా తెలంగాణ నాన్‌గజిటెడ్ హైదరాబాద్ జిల్లా ఉద్యోగులు కలిశారు.తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను శాలువ కప్పి తెలంగాణ నాన్ గజిటెడ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ, కార్యదర్శి విక్రమ్ కుమార్‌లు రవాణాశాఖ యూనిట్ ప్రతనిధులతో కలిసి సన్మానించారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు శంకర్,రవాణాశాఖ యూనిట్ అధ్యక్షులు అరుణేందర్‌ప్రసాద్,కార్యదర్శి పవన్‌కుమార్,కోశాధికారి ఉదయ్‌రాజ్, ఉపాధ్యక్షులు మహ్మద్ పర్వేజ్,సంయుక్తకార్యదర్శి శ్రీలత, నవీన్ కుమార్,వాసిఫిఇక్బాల్ పాల్గొన్నారు.ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత రోడ్డురవాణా శాఖ టిఎన్‌జిఓ ఉద్యోగులతో కలిసి సమస్య లను పరిష్కరించే దిశలో చర్యలు చేపడుతామని మంత్రి ప్రభాకర్‌గౌడ్ హామి ఇచ్చినట్లు చెప్పారు.

## అయ్యప్పస్వామి పడి పూజల్లో పాల్గొన్న అదనపు డిసిపి



అఫ్జల్‌గంజ్, డిసెంబర్ 18ప్రభాతవార్త: భాగ్యనగర్ అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడి పూజల్లో అదనపు డిసిపి రావుల గిరిధర్ పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భాగ్యనగర్ అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో ప్రతియేటా అయ్యప్పస్వామి మహాపడి పూజలు చేయడం పట్ల బాస్ ప్రతినిధులను అభినందించారు. అంతేకాకుండా సామాజిక సేవా రంగాల్లో కూడా బాస్ ప్రతినిధులు అనాథ బాలురకు విద్యాభోదనలను అందించడం పట్ల గొప్ప విషయమన్నారు. ఈకార్యక్రమంలో బాస్ అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణగురు స్వామి, బాస్ సలహాదారులు దేవర రాజేశ్వర్,కట్టమల్లేశం,రాకేష్,విజయ్ బాస్కర్ పాల్గొన్నారు.

### కంటోన్మెంట్ బోర్డుకు ఎక్సలెన్స్ అవార్డు : సిఈఓ మధుకర్ నాయక్

కంటోన్మెంట్,డిసెంబర్ 18ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా ఉన్న 62 కంటోన్మెంట్‌లలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు భారత రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి కేటగిరి ఏలో రక్షా మంత్రి అవార్డు దక్కించుకుంది. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో 2003లో చేపట్టిన స్వచ్ఛ చావని, స్వచ్ఛత చావని చేపట్టిన కార్యక్రమాల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు ఏ కేటగిరిలో మొదటి స్థానం దక్కినందుకు సిఈఓ మధుకర్ నాయక్, శానిటరీ సూపరిండెంట్ ఎం.దేవేందర్, ఛీఫ్ ఇంజనీర్ గోపాల క్రిష్ణలతో పాటు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బోర్డు ఎంప్లాయిస్ యూనియన్ సంతోషం వ్యక్తం చేశారు.

## షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

### ఏడు లక్షల రూపాయల ఆస్తి నష్టం

చార్మినార్, డిసెంబరు 18 ప్రభాతవార్త : ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో దాదాపు ఏడు లక్షల రూపాయలు విలువ గల వస్తువులు కాలి పోయిన సంఘటన సోమవారం ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర కథనం ప్రకారం.. పాతబస్తీకి చెందిన అహ్మద్ గత కొంత కాలం నుంచి మదీనా కాలనీలో చిల్డ్రన్స్ జనరల్ షో రూమ్‌ను నిర్వహిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు షాపులో మంటలు వ్యాపిం చాయి.అగ్ని ప్రమాదం కారణంగా షాపులో ఉన్న దాదాపు ఏడు లక్షల రూపాయలు విలువ చేసే వస్తువులు కాలి పోయాయి.పోలీసులు అగ్ని మాపక కేంద్రాలను రప్పించి మంటలను ఆర్పి వేశారు.విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.ఈ కేసును ఫలక్‌నుమా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు

చిక్కడపల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త: అశోక్ నగర్ గీతాంజలి హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు 20న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించబోతున్నట్లు స్కూల్ కార్యదర్శి ఎన్.శాంతా తెలిపారు.

# ఆటో డ్రైవర్ల ఉపాధిని రాష్ట్ర ప్రభుత్వమే కాపాడాలి

### బిపిటిఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్

చిక్కడపల్లి, డిసెంబరు 18 ప్రభాతవార్త: ఆటో డ్రైవర్ల ఉపాధిని రాష్ట్ర ప్రభుత్వమే కాపాడాలని బిపిటిఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలను స్వీకరించిన పొన్నం ప్రభాకర్‌ను బిఎంఎస్ అనుబంధ తెలంగాణ స్టేట్ ఆటో అండ్ టాక్సీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నంద కిషోర్, బి.పెంటయ్యగౌడ్, గ్రేటర్ ఆటో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ ముదిరాజ్, ఎస్.కిషన్, ఉపాధ్యక్షుడు ఎండి.హబీబ్, సంఘటన కార్యదర్శి ఇ.శంకర్‌లతో కలిసి మంత్రిని కలిసి అభినందించారు. ఆలూరి రవిశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసిలో మహిళల ఉచిత ప్రయాణం పునరాలోచన చేయాలని లేదా బస్సుల సంఖ్య తగ్గించాలని, గగ ప్రభుత్వం అపాలోచితంగా ప్రవేశపెట్టిన ఓలా, ఊబర్, రాపిడ్ బైక్‌ల అక్రమ వ్యాపారాన్ని నిషేధించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఆటోడ్రైవర్ల ఉపాధిని కాపాడటానికి వివిధ ప్రభుత్వ విభాగాలలో ఆటోలను వినియోగించుకోవాలని, మహిళల ఉచిత బస్సు ప్రయాణం అరికట్టకపోతే ఆటోడ్రైవర్లకు రోజుకు రూ.1000 సంపాదించుకునే విధంగా ప్రభుత్వం అధికారికంగా తగు ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, గత 10 సంవత్సరాలలో పలుమార్లు పెట్రో, డీజిల్, ఎల్‌పీజీ, సిఎన్‌జీ ధరలు పెరిగినా కూడా ఆటో మీటర్ రేట్లు పెరగలేదని, వెంటనే ఆటోమీటర్ రేట్లు పెంచాలని , ఆటోపర్మిట్ 60 కిలోమీటర్ పరిధిని తీసివేసి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లేదా మొత్తం రాష్ట్రవ్యాప్త పర్మిట్లు జారీ చేయాలని, ఫలితంగా ఆటోడ్రైవర్ల వ్యాపారాన్ని పెంచవచ్చని సూచించారు. అక్రమ ఛలాన్‌లు మాఫీ చేయాలని, ఆర్టీఏ కార్యాలయాల్లో అక్రమ దళారీలను అరికట్టాలని, కేంద్రం ప్రకటించిన వెహికిల్ స్క్రాప్ పాలసీని అమలు చేసి అవినీతిని అరికట్టాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ త్వరలోనే ఆటో సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను సానుకూల వాతావరణంలో పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# చదువుతో సమానంగా ఆటలకు ప్రాధాన్యత నివ్వాలి

### ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


బండ్లగూడ కార్పోరేషన్‌లోని రంగారెడ్డినగర్ కాలనీలో పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, డిసెంబర్ 18 ప్రభాతవార్త : మన బిడ్డల సమగ్ర వికాసం కోసం, చదువుతో సమానంగా ఆటలకు ప్రాధాన్యతనివ్వాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం బండ్లగూడ కార్పోరేషన్ రంగారెడ్డి నగర్ కాలనీలో కార్పోరేటర్ తలారి చంద్రశేఖర్ తన సొంత డబ్బుతో పిల్లల పార్కులో ఏర్పాటు చేసిన ఆట సామాగ్రిని మేయర్ మహేందర్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ఎదిగే వయసులో ఉన్న చిన్నారులు ఎంత ఆటలు ఆడితే అంత చురుగ్గా తయారవుతారన్నారు. క్రమం తప్పకుండా ఆటలాడే విద్యార్థులలో శారీరక, మానసిక వికాసం పెరుగుతుందన్నారు. ఆటలతో గెలుపు,ఓటములను సమానంగా స్వీకరించే అలవాటు పెరుగుతుందని, జీవితంలో ఎదురయ్యే ఓటమితో కుంగి పోకుండా మళ్లీ గెలిచేందుకు ప్రయత్నం చేస్తారన్నారు. చదువులతో పాటు ఇప్పుడు సమాజంలో ఆటలకు కూడా మంచి డిమాండ్ ఉందన్నారు. క్రికెట్, కబడ్డీ, ఫుట్‌బాల్, షటిల్, బ్యాడ్మింటిన్, హాకీలకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. చిన్నారుల అభిరుచిని, ఆసక్తిని తెలుసుకొని ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పిల్లలను చదువు ఒక్కటే బంగారు భవిష్యత్తును ఇస్తుందని, నిత్యం వారిని పుస్తకాల పురుగుల్లా మార్చవద్దని, చదువాలని ఒత్తిడి చేయవద్దని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సూచించారు. పిల్లల కోసం తన సొంత డబ్బులు పెట్టి ఆట వస్తువులు కొనిచ్చిన కార్పోరేటర్ చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, కార్పోరేటర్‌లు రవీందర్‌గౌడ్, శ్రీనాథ్‌రెడ్డి, సాగర్‌గౌడ్‌లు సీనియర్ నేతలు నాగరాజు, ప్రేమ్‌గౌడ్, ఖాజా, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్‌నెస్ కోసం శ్రమించి పనిచేయాలి

హైదరాబాద్, డిసెంబరు 18,ప్రభాతవార్త: ఫిట్‌నెస్ అనేది కేవలం బరువు తగ్గించుకోవడానికి వినియోగించే మ్యాజిక్ పిల్ కాదని దానికోసం శ్రమించి పనిచేయాలని ప్రముఖ ఫిట్‌నెస్ ట్రైనర్ యాస్మిన్ కరాచీవాలా అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడలోని ఓహోటల్‌లో ఫిక్కి లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌ఎల్‌వో) ఆధ్వర్యంలో జరిగిన " రివల్యూలైజ్ యువర్ వర్క్ అవుట్ "అనే సెషన్‌లో ప్రసంగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కత్రినాకైఫ్, దీపికా పదుకునే, కరీనా కపూర్, ప్రీతిజింటా, మలైకా అరోరాఖాన్, బిపాసాబసు, అలియా భట్, ఇలియానా వంటి వారికి తాను ఫిట్‌నెస్ ట్రైనర్‌గా సేవలందించినట్లు తెలిపారు. మనం ఫిట్‌గా ఉండేందుకు వ్యాయామం ప్రారంభించాలంటే శరీరం, బలాలు, పరిమితులు అర్థం చేసుకుని వ్యాయమం చేయాలన్నారు. ముఖ్యంగా బరువు తగ్గించుకోవాలంటే రోజుకు ఏడున్నర గంటలపాటు నిద్రపోవాలని మంచి నిద్ర అనేది శరీరం వ్యాధుల నుంచి రక్షించే ప్రధాన రక్షణాల్లో ఒకటన్నారు. ఇలా చేయడం వల్ల రోజంతా ఎనర్జటిక్‌గా ఉంటారని దీన్ని అందరూ తప్పక పాటించాలన్నారు.ఈకార్యక్రమంలో ఎఫ్‌ఎల్‌వో హైదరాబాద్ చైర్ పర్సన్ రీతుషా తదితరులు పాల్గొన్నారు.

